క్లుప్తంగా

కులగణన సర్వేకు అవకాశం

దౌల్తాబాద్: సమగ్ర ఇంటింటి సర్వేలో పాల్గొనని వారు ఈనెల 28వ తేదీలోగా నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సర్వేలో ఇప్పటివరకు నమోదు చేసుకోని వారు ప్రజాపాలన కేంద్రాల్లో సమాచారం అందించాలని గతంలో తాళం వేసి ఉన్న ఇళ్లు, ఆసక్తి లేకపోవడం తదితర కారణాలతో సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ రాజకీయ, కులగణన ఇంటింటి సర్వే హౌస్‌లిస్ట్‌లో ఉండి సర్వే చేయని కుటుంబాలకు ఈనెల 28 వరకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. టోల్ ఫ్రీ నంబర్ 040–21111111కు ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల మధ్యకాల్ చేసి సమాచారం అందజేయవచ్చని లేదా ఆన్‌లైన్ ద్వారా ఫారమ్ డౌన్‌లోడ్ చేసుకుని సంతకం చేసిన అనంతరం ఎంపీడీఓ ఆఫీస్‌లోని ప్రజాపాలన కేంద్రంలో సమర్పించవచ్చని ఆయన పేర్కొన్నారు.

పరీక్ష ప్యాడ్ల అందజేత



దౌల్తాబాద్: మండలంలోని మాటూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కోట్ల హన్మంతు సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్ష ప్యాడ్లు అందజేశారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహిపాల్,శివరాం, అంజి తదితరులు పాల్గొన్నారు.

7,309 మందికి రైతుభరోసా లబ్ధి

తాండూరు రూరల్: మండలంలో 7,309 మంది రైతులకు రైతు భరోసా కింద రూ.6.25 కోట్లు వారి ఖాతాలో జమ అయినట్లు ఏఓ కొమరయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 13,222 మంది రైతులు వారి బ్యాంక్ ఖాతాలో వ్యవసాయ కార్యాలయానికి అందజేశారన్నారు. ఇప్పటి వరకు 7,309 మంది రైతులకు సంబంధించి 10,423 ఎకరాలకు రైతు భరోసా నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. అలాగే మండలంలో 975 ఎకరాలు సాగుకు యోగ్యం కాని భూములుగా గుర్తించామన్నారు. త్వరలో మిగతావారికి డబ్బులు పడతాయని చెప్పారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రప్ప

బంట్వారం: ప్రణాళిక బద్ధంగా చదివి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ చంద్రప్ప సూచించారు. సోమవారం ఆయన కోట్‌పల్లి జెడ్పీహెచ్ఎస్, కేజీబీవీలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రాజెక్ట్ పనులు, ఎఫ్ఏ రికార్డులను పరిశీలించారు. సమయాన్ని వృథా చేయకుండా పరీక్షల సమయంలో బాగా చదువుకోవాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

ఎంపీడీఓ రాములు

బంట్వారం: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని ఎంపీడీఓ రాములు అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని నాగవరం, తండాను సందర్శించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారమే ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో దరఖాస్తులు నిల్

మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. ఎంపీడీఓ రాములు, ఆయా శాఖల సిబ్బంది మీటింగ్ హాల్‌లో వేచి చూసినప్పటికీ ప్రజల నుంచి స్పందన కనిపించలేదు.

పన్నులు చెల్లించండి

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ తమ ఇంటి, దుకాణ సముదాయాల పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని మరికల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. సోమవారం చౌడాపూర్ మండలం మరికల్ గ్రామపంచాయతీ పరిధిలో ఇంటింటికి వెళ్లి పన్నులు వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా తమ ఇంటిపన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని సూచించారు. గ్రామంలోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు సమష్టిగా ముందుకు వెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన పనిముట్లు.. పెరిగిన పాట్లు

వ్యవసాయంలో సబ్సిడీ పరికరాలకు మంగళం

- ఏళ్లు గడుస్తున్నా అందని దుస్థితి
- తీవ్ర ఇబ్బందుల్లో రైతన్నలు
- పట్టించుకోని అధికారులు



కాడెద్దులతో విత్తనాలు వేస్తున్న రైతు (ఫైల్)

దోమ: ఆధునిక వ్యవసాయం రోజురోజుకు ప్రశ్నార్థకంగా మారుతోంది. యాంత్రీకరణ పరిజ్ఞానం ఆశించిన స్థాయిలో రైతులకు అందడం లేదు. మారుతున్న కాలానికి అనుగుణంగా తక్కువ పెట్టుబడితో సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో వ్యవసాయ శాఖ చేస్తున్న ప్రచారం కార్యరూపం దాల్చడం లేదు. వ్యవసాయ యాంత్రీకరణ పథకాలను గత ప్రభుత్వం పక్కన పెట్టినప్పటికీ ప్రస్తుత సర్కారు సైతం అటువైపు చూడకపోవడంతో రైతుల పరిస్థితి అధ్వానంగా తయారయింది. దీంతో సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందక తీవ్ర అవస్థల్లో కూరుకుపోయారు.

19 వేల మంది రైతులు

మండల వ్యాప్తంగా ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. మొత్తం 36 గ్రామ పంచాయతీలకు గాను 19 వేల మంది రైతులు వ్యవసాయంపై ఆధారపడుతున్నారు. వీరికి గతంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పథకాలు, సబ్సిడీ ద్వారా వచ్చే రోటోవేటర్, కల్టీవేటర్, తైవాన్ పంపులు, మినీ ట్రాక్టర్లు, టార్పలిన్ కవర్లతో పాటు తదితర పరికరాలను సబ్సిడీపై పంపిణీ చేసేది. కానీ ప్రస్తుతం రాయితీపై పరికరాలు అందకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ప్రభుత్వం ఈసారైనా యాంత్రీకరణ సామగ్రిని మంజూరు చేయాలని అన్నదాతలు విలపిస్తున్నారు.

ఆగిన వ్యవసాయ పథకాలు

వ్యవసాయ రాయితీ పరికరాలు ఒక్కొక్కటిగా 2006–07 నుంచి దశల వారీగా నిలిచిపోయాయి. రైతులకు ఎక్కువగా ఉపయోగపడే నాగళ్లు, ఇతర పనిముట్లు 2014లోనే ఆగిపోయాయి. దీంతో పొలాల్లో ఎద్దులతో పని చేసుకోవాల్సి పరిస్థితి ఏర్పడింది. 2016–17 ఆర్థిక సంవత్సరం వరకు అందుబాటులో ఉన్న పనిముట్లు ఆ తర్వాత పూర్తిగా కనుమరుగయ్యాయి. దీంతో కొన్నేళ్ల నుంచి రైతన్నలు తప్పని పరిస్థితుల్లో అప్పులు చేసి పరికరాలను కొనుగోలు చేసుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి వచ్చే వానాకాలం నాటికి వ్యవసాయ పరికరాలను అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

పదేళ్లుగా ఇబ్బందులు



గత ప్రభుత్వాలు రైతులకు సబ్సిడీ పరికరాలను ఏటా అందిస్తుండేది. కానీ పదేళ్లుగా సబ్సిడీ పరికరాలు రావడం లేదు. వ్యవసాయానికి కావాల్సిన పరికరాలు లేక అప్పులు తెచ్చి అధిక ధరలకు కొంటున్నాం. ప్రభుత్వం రైతులకు సబ్సిడీ కింద పరికరాలు అందజేసేలా చర్యలు తీసుకోవాలి.

– వెంకటయ్య, రైతు, బొంపల్లి

ఆందోళన చెందుతున్నాం



ప్రభుత్వం రైతులకు సబ్సిడీ పరికరాలను పంపిణీ చేయడంలో పూర్తిగా విఫలమైంది. వ్యవసాయం చేయాలంటేనే ఎన్నో అవస్థలు పడుతున్నాం. సబ్సిడీ పరికరాలు అందించి ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు చేతులెత్తేయడంతో ఆందోళనకు గురవుతున్నాం.

– సంతోష్, రైతు, పాలేపల్లి

ఇప్పటివరకు లేవు



ఇప్పటివరకు ఎలాంటి సబ్సిడీ పరికరాలు అందలేదు. ప్రభుత్వం వ్యవసాయ శాఖలో పరికరాలను అందుబాటులో ఉంచాలని కోరుతున్నాం. పలు సందర్భాల్లో కార్యాలయానికి వచ్చి మరి రైతులు అడుగుతున్నారు. విషయాన్ని ఉన్నతాధికారులకు విన్నవించాం.

– ప్రభాకర్‌రావు, ఏఓ, దోమ

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య



మాట్లాడుతున్న బసవ పున్నయ్య

అనంతగిరి: జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న సంఘం టీడబ్ల్యూజేఎఫ్ మాత్రమే అని ఆ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య చెప్పారు. సోమవారం అనంతగిరి ఫారెస్ట్ గెస్ట్ హౌస్‌లో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ సమావేశాన్ని అధ్యక్షుడు రవీందర్ నేతృత్వంలో నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా బసవపున్నయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించేందుకు నిరంతరం మంత్రులు, అధికారులను కలిసి జర్నలిస్టుల శ్రేయస్సు కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. రైల్వే పాసుల పునరుద్ధరించాలని రైల్వే నిలయం ఎదుట ధర్నా చేశామని, అందరికీ ఇళ్లస్థలాలు ఇచ్చేందుకు పలుమార్లు మంత్రులకు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. హెల్త్ కార్డుల కోసం కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా కార్యదర్శి ఎండి షఫీ, సభ్యులు సంజీవ్, వెంకట్ రాంరెడ్డి, బాలరాజు, జర్నలిస్టులు మాణిక్యం, అరుణ్, కుమార్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న తహసీల్దార్ విజయకుమార్

కొడంగల్ రూరల్ : పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండేందుకు వీలుంటుందని తహసీల్దార్ విజయకుమార్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని సంఘాయిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన పలు సూచనలందించారు. ఇంటి పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని, మురికినీటిలో దోమలు పెరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం గ్రామంలోని పలు వీధుల్లో పర్యటించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు సాయిరెడ్డి, బిచ్చిరెడ్డి అశోక్, కాశప్ప, భీమప్ప తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ డైరీల అందజేత



డైరీని పార్టీ శ్రేణులకు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి

మర్పల్లి: బీఆర్ఎస్ డైరీని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నార్రెగ శ్రీకాంత్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పబ్బే మధుకర్, మాజీ ఎంపీపీ రమేశ్ తదితరులు సోమవారం కార్యకర్తలు, నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ పాలనలో ప్రజలకు అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇందులో పొందుపర్చినట్లు తెలిపారు. ఎన్నికల హామీల అమలులో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దారుణంగా విఫలమైందని మొండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గౌస్, సహకార సంఘం మాజీ డైరెక్టర్ యాదయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయిని మధుకర్, పార్టీ వైస్ చైర్మన్లు రమేష్ మిత్ర, అశోక్, మాజీ సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతమైంది. శిబిరాన్ని వైద్యాధికారిపరిక్షిత్ నరేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటి వైద్య సహాయకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 35 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఆపరేషన్ల నిమిత్తం 21 మందిని మహబూబ్‌నగర్‌లోని రాంరెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రికి పంపించారు.

దైవచింతన అలవర్చుకోవాలి

- ఎమ్మెల్యే కాలె యాదయ్య



ధ్వజస్తంభ పూజలో ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు

చేవెళ్ల: ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని కౌకుంట్ల గ్రామంలో జరుగుతున్న నాభి శిల, ధ్వజస్తంభ, పోతురాజు విగ్రహాల పునఃప్రతిష్ఠ మహోత్సవ పూజలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన పూజలతో గ్రామం భక్తిభావంతో నిండిపోయింది.ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ మంత్రి సబితారెడ్డి స్వగ్రామమైన కౌకుంట్లలో జరుగుతున్న ఈ పూజల్లో ఆమె తనయుడు పి.కార్తీక్‌రెడ్డి దంపతులు, డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మండలంలోని పలు పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అందుబాటులో ప్రజాపాలన సేవా కేంద్రం

- ఎంపీడీఓ హిమబిందు



చేవెళ్ల ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రం

చేవెళ్ల: సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొననివారి వివరాలు నమోదు చేసుకునేందుకు మండల కేంద్రంలో ప్రత్యేకంగా ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు చేశామని ఎంపీడీఓ హిమబిందు తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ కులగణన సర్వేలో వివరాలు ఇవ్వనివారి కోసం ప్రభుత్వం ఈ నెల 28వ తేదీవరకు అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కేంద్రం ద్వారా సర్వేలో పాల్గొననివారు వచ్చి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. మండలంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో దాదాపు 17,400లకు పైగా కుటుంబాలకు సర్వే జరిగిందన్నారు. అప్పుడు మండలంలో మొత్తం 36 ఇళ్లు మాత్రమే డోర్‌లాక్ అని వచ్చిందని చెప్పారు. వారితో పాటు ఇంకా ఎవరైనా మిగిలిపోయి సర్వేలో వివరాలు నమోదు చేసుకోనివారు ఉన్నా ఈ ప్రజాపాలన సేవా కేంద్రం ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత

కాంగ్రెస్ పార్టీ కొడంగల్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి



పూజలో తిరుపతిరెడ్డి తదితరులు

దౌల్తాబాద్: ప్రతిఒక్కరూ దైవ చింతన కలిగి ఉంటే మానసిక ప్రశాంతత పొందుతారని కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గోకఫస్లాబాద్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయం, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. గ్రామస్తులంతా ఏకమై ఆలయ నిర్మాణం చేపట్టడం అభినందనీయమని అన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ప్రమోద్ రావు, వెంకట్‌రావు, రెడ్డిశ్రీను, భీంరెడ్డి, అనంతయ్య, కేశవరెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న వామపక్ష నాయకులు

సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి మల్లేశ్

పరిగి: ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంతో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి మల్లేశ్ ఆరోపించారు. హామీలు అమలు చేయాలని ఈ నెల 20న నగరంలో నిర్వహించే చలో హైదారాబాద్ కార్యక్రమం వాల్ పోస్టర్‌ను సోమవారం పరిగిలో విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పాటై 14 నెలలు పూర్తయినా అభివృద్ధి చేయలేదన్నారు. రైతు భరోసా రూ.15వేలు ఇస్తామని చెప్పి ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు పోరాటం చేస్తామన్నారు. గత నెలలో నాలుగు సంక్షేమాలను అమలుచేసిన సీఎం ఏ ఒక్కటి కూడా పూర్తిగా కార్యరూపం దాల్చలేదన్నారు. చలో హైదారాబాద్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబానికి ఆర్థికసాయం



కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న ఎస్సై

పరిగి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న భానుశంకర్ గత నెలలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో పరిగి ఠాణాలో ఉన్న సిబ్బంది, అధికారులు కలసి భానుశంకర్ కుటుంబానికి ఆసరాగా నిలిచారు. పీఎస్ సిబ్బంది మొత్తం రూ.55వేలు జమ చేసి సోమవారం ఎస్సై సంతోష్ కుమార్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. మాలో ఒకడిగా ఉంటూ విధులు నిర్వహిస్తున్న భానుశంకర్ అకాల మరణం చెందడం బాధకరమన్నారు. తమ వంతుగా ఆయన కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్నామన్నారు.

మార్మోగిన శివనామస్మరణ



మొయినాబాద్‌రూరల్: ఇరుముళ్లతో శ్రీశైలం బయలుదేరిన శివస్వాములు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని చాకలిగూడ గ్రామంలో దాదాపు 15 మంది శివమాల ధరించిన భక్తులు ఇరుముళ్లతో శ్రీశైలం బయలుదేరారు. ఈ సందర్భంగా గ్రామంలో గల శివాలయంలో ఇరుముళ్ల మహాపడి పూజను భక్తులు వైభవంగా నిర్వహించారు. దీంతో గ్రామ వీధులు శివనామస్మరణతో మార్మోగాయి. కార్యక్రమంలో నాయకులు రెడ్డిమోని యాదయ్య పాల్గొన్నారు.

వీరన్నకు ప్రత్యేక పూజలు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్ల గ్రామంలో సోమవారం గురుస్వామి భూపాలచారి ఆధ్వర్యంలో శివస్వాములు వీరన్నస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాలచారి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం శివ మండల దీక్షల సమయంలో గ్రామదేవతలకు పూజలు నిర్వహించి శ్రీశైలం వెళ్తారన్నారు. శివభక్తులు నియమనిష్టలతో దీక్షలు పూర్తిచేస్తే మోక్షం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో శివస్వాములు నర్సింలు, బుగ్గయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పరిగి: మొక్క నాటి సెల్ఫీ తీసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



కొడంగల్ రూరల్: మొక్క నాటుతున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

వాడవాడలా ఉప్పొంగిన అభిమానం

తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, భారత్ రాష్ట్ర సమితి అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు జన్మదినం సందర్భంగా ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు సంబరాలను అంబరాన్నంటించారు. సోమవారం ఉదయం నుంచి గ్రామాలు, మండలాలుగా కార్యక్రమాలను చేపట్టారు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అధ్యక్షుల ఆధ్వర్యంలో కేకులు కోసి వేడుకలు చేశారు. పలుచోట్ల మొక్కలు నాటారు. మాజీ సీఎం కేసీఆర్ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. – సాక్షి, నెట్‌వర్క్



మర్పల్లి: పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



బంట్వారం: కోట్‌పల్లిలో కేసీఆర్ బర్త్‌డే సంబురాలు



తాండూరు రూరల్: కోటబాసుపల్లిలో మొక్కలు నాటిన బీఆర్ఎస్ కార్యకర్తలు



దోమ: కేసీఆర్ జన్మదిన వేడుక



ధారూరు: కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



బొంరాస్‌పేట: కేకు పంచుకుంటున్న పార్టీ నాయకులు



దౌల్తాబాద్: బిచ్చాలలో బీఆర్ఎస్ కార్యకర్తలు



మోమిన్‌పేటలో..